మొన్నటిదాకా ఎలక్షన్ రాజా..

ఇప్పుడు కలెక్షన్ రాజా!

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కరీంనగర్ కార్పొరేషన్, మే 28 : కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావుకు మొన్నటి వరకు ఎలక్షన్ రాజా అని పేరు ఉందని, ఇప్పుడు అది కలెక్షన్ రాజాగా మారిందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో రైస్‌మిల్లర్లు, ఇతరులను బెదిరించి వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఫోన్ ట్యాప్ చేసి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అన్ని స్థానాల్లోనూ గెలిచి ఉండేదని తెలిపారు. కోరుట్లలో ఐదు సార్లు పోటీ చేసి ఓడిపోయిన నర్సింగరావు ఏదో పెద్ద నాయకుడిని అనుకొని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ గాలి వీచిన 2009 ఎన్నికల్లోనూ నర్సింగరావు 17 వేల ఓట్లతో ఓడిపోయారని, అలాగే తర్వాత ఎన్నికల్లో 70 వేల ఓట్లతో, 2014లో 22 వేల ఓట్లతో, 2018లో 32 వేల ఓట్ల తేడాతో ఓడి పోయారని గుర్తు చేశారు. 2023 ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా రాలేదని విమర్శించారు. కనీసం రెండో స్థానం కూడా రాలేదని, అలాంటి వ్యక్తి ఫోన్ ఎందుకు ట్యాప్ చేస్తారని ప్రశ్నించారు. ఐదుసార్లు పోటీ చేసినా ప్రజలు కనీసం ఆయనను గుర్తించలేదని విమర్శించారు. 1989లో కేసీఆర్‌కు డీజిల్ పోయించానని చెప్పుకొంటున్నాడని, ఆయన మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు కనిపిస్తున్నదని ఎద్దేవా చేశారు. ఖాదీ బోర్డులో ఏమైనా ఉంటే వెంటనే విచారణ చేయాలని, అందులో ఎవరు ఉన్నా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్ద నాయకులను తిడితే గొప్పవారం అవుతామనుకుంటే ప్రజలు ఛీత్కరించుకుంటారని హితవుపలికారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఏవైనా నిజాలు ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో తమకు ఎలాంటి సంబంధమూ లేదని ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. మొన్నటి వరకు కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదంటూ హంగామా చేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మేడిగడ్డ వద్ద మరమ్మతు పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. తనకు ప్రజా సేవలో రాజకీయం ఒక భాగం మాత్రమేనని, తాను ఎప్పటికీ బీఆర్ఎస్‌ను వీడిపోయేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు భూక్యా తిరుపతినాయక్, బోనాల శ్రీకాంత్, గందె మహేశ్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై ఆసక్తి

పొలాల్లో పశువుల పేడ వినియోగం • ట్రాక్టర్ల ద్వారా తరలింపు

ఓదెల, మే 28 : సేంద్రియ ఎరువులపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వీటివల్ల అనేక లాభాలు ఉండడంతో దూర ప్రాంతాల నుంచి పశువుల పేడను కొనుగోలు చేసి ట్రాక్టర్ల ద్వారా తెచ్చుకుంటున్నారు. కొన్నేండ్లుగా విచక్షణా రహితంగా క్రిమి సంహారక, రసాయన ఎరువులను వాడడం వల్ల భూసారం దెబ్బతినడం, పర్యావరణం కలుషితం కావడం, భూమి నిస్సారమై నేలలోని సూక్ష్మ జీవుల ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో అధికారులు కల్పించిన అవగాహన మేరకు సేంద్రియ ఎరువులపై దృష్టి మరల్చారు. ఈ క్రమంలో పశువుల పేడను కొనుగోలు చేసి తమ పొలాల్లో వేస్తున్నారు. మరికొందరు చెరువుల పూటిక మట్టిని పోయించుకుని భూసారాన్ని పెంచుకుంటున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులెక్కడ?

- ప్రధాని శంకుస్థాపన చేసి పది నెలలైనా ముందుకు సాగని ప్రక్రియ • మొదటి ప్యాకేజీలో పూర్తికాని భూసేకరణ
- రైతులతో తేలని పరిహారం పంచాయితీ

నాగ్‌పూర్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే(ఎన్‌హెచ్-163)లో భాగంగా మంచిర్యాల-వరంగల్ జిల్లాల మధ్య మొదటి ప్యాకేజీలో నిర్మించనున్న జాతీయ రహదారి పనులు ముందుకు సాగడం లేదు. గతేడాది జూలైలో ప్రధాని నరేంద్రమోడీ హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో రహదారి పనులకు శంకుస్థాపన చేయగా, పది నెలలైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. రహదారి నిర్మాణానికి సంబంధించి డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) విడుదల చేసి టెండర్లు పూర్తయినప్పటికీ అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు, భూ సేకరణ తదితర కారణాల వల్ల జాప్యం జరుగుతూ వస్తున్నది.

పెద్దపల్లి, మే 28 (నమస్తే తెలంగాణ): కొత్తగా నిర్మించే జాతీయ రహదారికి 2021 ఫిబ్రవరి 3న గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. గ్రీన్ ఫీల్డ్ హైవే తరహాలో పట్టణాలు, జనావాసాలకు దూరంగా మైదాన ప్రాంతాల గుండా సాగుతున్నది. ఈ జాతీయ రహదారి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి మొదలై ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ముగుస్తుంది. ఈ ఎక్స్‌ప్రెస్ రోడ్డును మూడు ప్యాకేజీల్లో చేపడుతున్నారు. మొదటి ప్యాకేజీ కింద మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం నార్వ నుంచి పెద్దపల్లి ముత్తారం మండలం ఓడేడ్ వరకు 37.96కిలో మీటర్లు తీసుకున్నారు. ఈ నాలుగు వరుసల రహదారి నిర్మాణాన్ని 2027 వరకు పూర్తి చేసేలా డీపీఆర్‌లో పొందుపరిచారు. నాగ్‌పూర్ నుంచి మంచిర్యాల వరకు ఇప్పటి వరకు ఉన్న రెండు వరసల స్టేట్ హైవేను నాలుగు వరసలుగా విస్తరిస్తుండగా, మంచిర్యాల నుంచి మంథని నియోజకవర్గం మీదుగా వరంగల్ వరకు మాత్రం కొత్తగా నాలుగు వరసల రహదారిని నిర్మించనున్నారు. అయితే ఎన్నికలకు ముందు భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగడంతో త్వరలోనే ఇది పూర్తవుతుందని అధికారులు భావించారు. కానీ, అసెంబ్లీ, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు జరగడం, త్వరలోనే స్థానిక సంస్థ ఎన్నికలు జరిగే అవకాశాలు సైతం కనిపిస్తుండడంతో జాప్యం జరుగుతున్నది. అధికారులు ఎన్నికల బిజీలోనే ఉండగా, భూసేకరణకు బ్రేక్ పడుతున్నది.

తేలని పరిహారం

ప్యాకేజీ-1 కింద మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల నుంచి ప్రారంభమయ్యే జాతీయ రహదారి మంథని మండలం ఉప్పట్ల గోదావరి సమీపం నుంచి పోతారం, విలోచవరం, నాగారం, కన్నాల, పుట్టపాక, రామగిరి మండలం ఆదివారంపేట, బేగంపేట, నవాబ్‌పేట, ముత్తారం మండలం లక్కారం, కేశన్‌పల్లి, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడు మీదుగా వరంగల్ జిల్లాలోకి వెళ్తుంది. మూడు మండలాలు, 16 గ్రామాల మీదుగా వెళ్లే ఈ దారి పొడవు 37.96 కిలోమీటర్లు. ఈ రహదారికి 505.25 ఎకరాల భూమి అవసరమవుతుందని హైవే అథారిటీ సూచించింది. అయితే భూ సేకరణకు సంబంధించి పరిహారం చెల్లింపులో కొందరు కోర్టును ఆశ్రయించారు. అవార్డు పాస్ చేసేందుకు అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రైతులకు న్యాయం చేయాలని అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి శ్రీధర్ బాబు జూలైలోనే ప్రధాని మోడీ, కేంద్రమంత్రితోపాటు అప్పటి సీఎం కేసీఆర్‌కి మెయిల్ ద్వారా పంపిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

రైతుల డిమాండ్ ₹20లక్షలు

గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేకు సంబంధించి పెద్దపల్లి జిల్లాలో 505.25ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉన్నది. అందుకు రెండు విధాలుగా భూసేకరణ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. మొదట 2021లో మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లోని 380.25 ఎకరాలకు నోటిఫికేషన్ ఇవ్వగా.. అప్పటి మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూ సేకరణ చేసి పరిహారం చెల్లించాలి. మంథని, రామగిరి మండలాల్లో మార్కెట్ వ్యాల్యూ ఎకరాకు ₹2లక్షలు ఉండగా, భూసేకరణ చట్టం ప్రకారం.. ₹6 లక్షలు ఇవ్వాలి. అలాగే ముత్తారం మండలంలో ఎకరాకు ₹1.20లక్షలు ఉండగా, ₹3.60 లక్షలు ఇవ్వాలి. ఈ మూడు మండలాలకు 2022లో వచ్చిన 125 ఎకరాల భూసేకరణకు సంబంధించి రెండో నోటిఫికేషన్ ప్రకారం చెల్లింపులు చేస్తే.. అప్పుడు ప్రభుత్వం మార్కెట్ వ్యాల్యూను రెండు సార్లు పెంచింది. ఆ ప్రకారం అయితే అప్పటి మార్కెట్ వ్యాల్యూ ప్రకారం మంథని, రామగిరి మండలాల్లో ఎకరాకు ₹4.50లక్షలు ఉండగా.. ₹13.50లక్షల వరకు వచ్చే అవకాశమున్నది. ముత్తారం మండలంలో ₹2.75లక్షలు ఉండగా.. ₹8.25 లక్షల వరకు వచ్చే అవకాశమున్నది. కానీ, రైతులు మాత్రం తమ భూములకు ఎకరాకు ₹20లక్షల వరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవే భూములను తాము బహిరంగా మార్కెట్లో విక్రయిస్తే ఎకరాకు ₹50 లక్షల నుంచి ₹60 లక్షల ధర పలుకుందని చెబుతున్నారు. తమ భూములను ఇచ్చేందుకు వెనుకడగు వేస్తున్నారు. ఈ కారణంగానే గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు నత్తనడకన సాగుతున్నట్టు తెలుస్తున్నది. భూసేకరణ, పరిహారం త్వరగా తేల్చితేనే పనుల ప్రక్రియ వేగంగా సాగనున్నది.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే..

ప్రభుత్వం జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి అన్ని చర్యలు చేపడుతున్నది. పరిహారం చెల్లింపు ఆమోదయోగ్యంగా లేదని రైతులు పలుసార్లు వినతి పత్రాలు ఇచ్చారు. మేం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. భూసేకరణ చట్టం ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల వ్యాల్యూయేషన్ ప్రకారం చెల్లింపులు చేపడుతాం. ప్రస్తుతం రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించిన వారిని ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా గుర్తించాం. వారి వద్ద నుంచి భూములకు సంబంధించిన పట్టా పాస్‌బుక్‌లు, బ్యాంకు పాస్ బుక్కులు, ఆధార్ కార్డులను, ఫొటోలను సేకరిస్తున్నాం. ఆ తర్వాత ప్రభుత్వ తదుపరి ఆదేశాల ప్రకారం ముందుకు సాగుతాం.

- హనుమనాయక్, ఆర్డీవో (మంథని)

వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద పచ్చిరొట్ట విత్తనాల కోసం నిరీక్షిస్తున్న రైతులు

పచ్చిరొట్ట కోసం బారులు

- మెట్‌పల్లి ఏడీఏ ఆఫీస్ వద్ద రైతుల పడిగాపులు
- డిమాండ్ ఎక్కువ, సరఫరా తక్కువ ఉండడమే కారణం

మెట్‌పల్లి ,మే 28: మక్క, సోయాబీన్, వడ్లు తదితర రకాల విత్తనాలు దేవుడెరుగు, కనీసం పచ్చిరొట్ట విత్తనాలు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతున్నది. అందుకు వ్యవసాయ శాఖల కార్యాలయాల వద్ద రైతులు పడుతున్న పడిగాపులే నిదర్శనంగా చెప్పొచ్చు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఏడీఏ కార్యాలయానికి మంగళవారం పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయన్న సమాచారంతో మెట్‌పల్లి మండలం, పరిసర మండలాల్లోని రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని ఆగ్రోస్, డీసీఎమ్మెస్ దుకాణాలతో పాటు ఏడీఏ కార్యాలయం వద్ద రైతులు బారులు తీరారు. పోలీస్ పహరా నడుమ టోకెన్లు, విత్తనాల పంపిణీ చేపట్టడం గమనార్హం. అయితే రైతులకు అవసరం మేరకు (డిమాండ్) కాకుండా తక్కువ మొత్తంలో సరఫరా చేయడం వల్ల గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. మెట్‌పల్లి మండలానికి 2 వేలు బస్తాల జీలుగ (ఒక్కో బస్తా 30 కిలోలు), వెయ్యి బస్తాల జనుము (ఒక్కో బస్తా 40కిలోలు) డిమాండ్‌కు గాను కేవలం 600 బస్తాల జీలుగ, 400 బస్తాల జనుము మాత్రమే రావడం, మళ్లీ ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండడంతో రైతులు ఎగబడుతున్నారు. ఆధార్ కార్డు, పాస్‌పుస్తకాన్ని వెంట పెట్టుకుని పెద్ద సంఖ్యలో వ్యవసాయ శాఖ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. మరో వారం వ్యవధిలో డిమాండ్‌కు తగ్గట్టుగా జీలుగ, జనుము విత్తనాలు వస్తాయని వ్యవసాయ అధికారులు మాత్రం సూచిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. మళ్లీ పంట వేసే సమయం ఆసన్నం కావడంతో పచ్చిరొట్ట విత్తనాలు సరిపడా దొరక్క వరి సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు.

యువకుడి కిడ్నాప్.. హత్య

పచ్చునూర్‌లో కలకలం

మానకొండూర్ రూరల్, మే 28 : ఓ యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి, హత్య చేసిన సంఘటన మానకొండూర్ మండలంలో కలకలం రేపింది. స్థానికులు, గ్రామస్తులు, పోలీసులు వివరాల ప్రకారం.. పచ్చునూర్‌కు చెందిన గోపు ప్రశాంత్ రెడ్డి(20)పై మంగళవారం తెల్లవారుజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులోని శివాలయం వద్ద దాడి చేసి చితకబాదారు. వారు కొట్టిన దెబ్బలు తట్టుకోలేక ప్రశాంత్‌రెడ్డి దగ్గరలోని పాడుబడ్డ బావిలో దూకాడు. అయినా వదలకుండా సదరు వ్యక్తులు బావిలో నుంచి ప్రశాంత్‌ను బయటకు తీసి, కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. ఈ విషయమై స్థానికులు అప్పటికే పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు తెల్లవారు జామునే రంగంలోకి దిగి ఊటూర్, వేగురుపల్లి, పచ్చునూర్ గ్రామ శివారుల్లోని పరిసర ప్రాంతాల్లో దాదాపు 12 గంటలపాటు గాలింపు చర్యలు చేపట్టారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ, మానకొండూర్ సీఐ రాజ్ కుమార్ ఆయా గ్రామాల్లో ఉన్న సీసీ పుటేజీలను సైతం పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. చివరగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామ శివారులోని మానేరు వాగులో గోపు ప్రశాంత్‌రెడ్డి మృత దేహాన్ని గుర్తించారు. అయితే ప్రశాంత్‌రెడ్డి తల్లిదండ్రులు రామవ్వ, రఘునాథ్‌రెడ్డి దాదాపు పదేళ్ల క్రితమే మరణించారు. ఆ యువకుడి అన్న శ్యాంసుందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ రాజ్ కుమార్ తెలిపారు.